# తక్షశిల

**-కారంపూడి వెంకట రామదాస్**

"అన్నపూర్ణా! జీవితంలో అన్ని బాధ్యతలూ సమర్థవంతంగా నిర్వర్తించీ ఆ సంకెళ్ల నుండి బయటపడ్డా ఎందుకో నా మనసులో ఏదో అసంతృప్తి ఇంకా అలుముకునే వుంది" చాలా నిర్లిప్తంగా అన్నాను.

"దేనికండి అసంతృప్తి? అబ్బాయి మీదగానీ మనసు మళ్లిందా?"

"లేదు. వేరే ఏదో చెప్పలేని వెలితి నన్ను వెంటాడుతున్నది."

"అదీ మన అమ్మాయి అత్తారింటికి వెళ్లిందన్న దిగులేమో?"

"కాదు. మన పిల్లలకేం? మగపిల్లాడితో సమానంగా ఆడపిల్లని కూడా ఇంజనీర్‌ను చేసాం. వారి వారి జీవితాల్లో హాయిగా సెటిలైపోయారు. ఇంకా వాళ్లమీద దిగులెందుకు?"

"మరి దేనికి?"

"దేనికి? అన్నదానికి సూటిగా సమాధానం నాకు అందడంలేదు. అందుకే ఆలోచనలో పడ్డాను. బాగా ఆలోచిస్తే ఇప్పుడిప్పుడే చూచాయిగా ఏదో అర్థమవుతున్నది. నామీద నేనే ప్రశ్నల్ని సంధించుకున్నాను. ఇంతవరకూ ఏం సాధించానని? ఓ కొడుకుగా, భర్తగా, తండ్రిగా వివిధ పాత్రలని సమర్థవంతంగా పోషించాను అంతే. ప్రపంచంలో బాధ్యతగల ప్రతి ఒక్కరూ చేసే పనే. దీంట్లో ప్రత్యేకత ఏముంది? దీనివలన ఎవరికి ప్రయోజనం? వారి వారి కుటుంబాలకి తప్ప! ఈ అరవైఏళ్ల జీవితంలో నావల్ల సమాజానికి ఏదైనా మేలు జరిగిందా? అని వెనక్కి తిరిగి చూసుకుంటే కారు చీకటి. సరిగ్గా ఇదే నాలో అసంతృప్తి బీజాన్ని నాటింది. దానికితోడు ఈ రోజు జరిగిన సంఘటన అగ్నికి ఆజ్యం పోసినట్లు నాలో అసంతృప్తి జ్వాలన్ని మరింత రగిలించింది. నాలో అంతర్మథనం మొదలైంది"

"ఏంటండీ ఆలోచనలో పడ్డారు?"

"అదీ... జీవితంలో నాకూ అంటూ చెప్పుకోదగ్గది ఇంతవరకూ నేనేమీ సాధించలేదు. దానికి ముఖ్యకారణం ఇంతవరకూ నాకు సమయమూ, అవకాశమూ రెండూ లేకపోవడమే. ఇన్నాళ్లూ బాధ్యతతో కూడుకున్న మెకానికల్ లైఫ్ కూడా ఓ కారణమే. కానీ ఇప్పుడా అడ్డులేదు. రిటైరై నేను స్థిరపడ్డా ఇదే సరైన సమయం అన్పిస్తోంది" అంటూ కాసేపు ఆగాను.

నా మాటలు అన్నపూర్ణని కాస్త అయోమయంలో పడేసిన మాట వాస్తవం.

ఆలోచిస్తున్నాను. బాగా ఆలోచిస్తున్నాను. నా మెదడు చురుగ్గా పని చేస్తోంది. నా గమ్యం లీలగా గోచరిస్తోంది. నా గమ్యానికి పరిపూర్ణ రూపం కోసం మెదడుకి పదునుపెట్టాను.

"ఏవండీ! ఇంతకీ ఏమిటి మీ ఆలోచన సూటిగా చెప్పండి?"

కొంచెం వివరంగా చెప్తేగానీ అన్నపూర్ణకి నా ఆలోచన అర్థం కాదనుకున్నాను. నా ఈ అసంతృప్తికి అసలు కారణం విపులంగా చెప్తే వాదనకి మరింత బలం చేకూరుతుందని తలచాను.

"అన్నపూర్ణా! నీకు గుర్తుందా? మన శ్రీను ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్టు రాసిన రోజులు..."

"అవును. ఆ రోజుల్లో మీరు పడ్డ కష్టం, మానసిక వత్తిడి అన్నీ గుర్తున్నాయి"

"నిజమే. అయితే మన శ్రీనుతోపాటూ అదే వయసువాడైన మన పనిమనిషి రంగమ్మ కొడుకు శేషు గుర్తున్నాడా?"

"లేకేం మనవాడితో సమానంగా ఇంటర్‌వరకు చదివాడుకదా. తెలివైనవాడు కాబట్టి స్కాలర్‌షిప్‌తో అంతవరకు చదవగలిగాడు."

నిజానికి శేషు తెలివితేటల్లో శ్రీనుకంటే ఓ మెట్టుపైనే... నాలో నేను అనుకున్నాను.

"ఆ శేషు ఈమధ్య కనిపించాడు."

"ఆ... శేషు కనిపించాడా? ఇప్పుడేం చేస్తున్నాడండీ. ఇంతకీ రంగమ్మ ఎలా వుంది? వారంతా ఇప్పుడెక్కడున్నారు?" ఆతృతగా ప్రశ్నల్ని సంధించింది అన్నపూర్ణ.

ఆమె వారినెప్పుడూ పనివారిగా చూడలేదు. అందుకే వారి బాగోగుల గురించి ఆరాటంతో ఆరా తీసింది అన్నపూర్ణ.

"కారు గేరేజీ నడుపుతున్నాడు" ఈ మాటలు అంటున్నప్పుడు నా గొంతు చిన్నగా వణికింది.

"ఏమిటీ శేషు మెకానిక్కయ్యాడా?" కాసింత నిరుత్సాహంగా అంది అన్నపూర్ణ.

"అవును. మనం కానీ ఆనాడు ఆర్థికంగా ఆదుకుని వుంటే శేషు ఈ రోజు ఏ పెద్ద ఆటోమొబైల్ కంపెనీలోనో మెకానికల్ ఇంజనీర్ అయి ఉండేవాడు. రంగమ్మ తన బిడ్డని ఇంజనీర్ చేయడానికి పడిన పాట్లు నాకు ఇంకా గుర్తే. నేనూ నా స్నేహితులు ఎంత ప్రయత్నించినా ఆర్థికంగా ఆదుకోలేకపోయాం. అప్పుడు మన ఆర్థిక పరిస్థితి అటువంటిది"

"అవునండి. ఆ రోజుల్లో మీ స్నేహితులు కూడా 'రాఘవరావు గట్టి ప్రయత్నం చేసినా శేషుని ఆదుకోలేకపోయాడని' బాధపడేవారు. మన పిల్లల్ని కూడా ఏ ప్రైవేటు విద్యా సంస్థలలో చేర్చకుండా స్వయంగా మీరే కోచింగ్ ఇచ్చినందువల్లేగా వాళ్లు ఇంజనీర్లు అయింది. శేషు ఎంట్రెన్స్ అయితే మీ సహాయంతో పాసయ్యేవాడేమోగానీ ఆ తరువాత కనీసం మూడేళ్ల ఇంజనీరింగ్ చదువుకు అయ్యే ఖర్చులు ఎలాగనే కదా రంగమ్మ కొడుకు చదువుపై ఆశలు వదులుకుంది."

"ఈ లోకంలో అర్హతలున్నవారికి రాణించే అవకాశం లేక వెనకబడుతున్న వారు ఎందరో... అందులో శేషు ఒకడు. వారు అలా ఉండిపోవలసిందేనా? వారి తలరాతలు మార్చలేమా? అర్హత





లేని వారు డాక్టర్లు, ఇంజనీర్లుగా మారుతున్నారు. వారి చేతుల్లో మన దేశానికి భద్రత ఉందంటావా? అర్హులకు అవకాశం లభించాలి. అందుకు నా చేతనైనది ఈ చరమదశలో చేయాలనుకుంటున్నాను. మట్టిలో మాణిక్యాలని వెలికి తీద్దామన్నదే నా ఉద్దేశ్యం. ఇదే నా ప్రస్తుత లక్ష్యం."

"బాగుందండీ. మీ ఆలోచన చాలా బాగుంది. ఇంతకీ మీ లక్ష్యాన్ని ఎలా సాధించాలనుకుంటున్నారు?" కుతూహలంగా అడిగింది అన్నపూర్ణ.

నా మనసులో మాట చెప్పాను. ఆశ్చర్యపోయింది అన్నపూర్ణ.

అప్పుడు నా భార్య నావైపు చూసిన చూపులో ఆమెకి నాపై రెట్టింపు గౌరవ భావం స్పష్టంగా కనబడింది.

★★★

'తక్షశిల!'

రాఘవరావు ఆశయాల ప్రతిరూపానికి ప్రతీక.

తక్షశిల ఆవిర్భవానికి రాఘవరావు కర్త అయితే అన్నపూర్ణ క్రియ. ఎప్పుడూ భర్తకి చేదోడువాదోడుగా ఉంటూ అన్నపూర్ణ తక్షశిల నిర్మాణానికి అందించిన సహకారం అపారం. విద్యాలయంగా మార్చి సొంత బ్యాంకు బ్యాలెన్సుని (రిటైర్మెంట్ బెనిఫిట్స్) ఆశయ సాధనకి ఆవిరి చేసాడు రాఘవరావు. ఈ త్యాగాల ఫలితమే తక్షశిల. అర్హులైన పేద విద్యార్థుల భవిత మార్గదర్శి!

★★★

ఈ దేశంలో ఏదీ ఉచితంగా లభించదు. ఒకవేళ లభిస్తే అందరికీ దానిపట్ల చులకన భావం తప్పదు. తక్షశిల కోచింగ్ సెంటర్ ప్రారంభించిన మొదట్లో నాకూ సరిగ్గా ఇదే అనుభవం


ఎదురైంది. అర్హులుగా తలచినవారికి ఉచితంగా కోచింగ్ ఇద్దామనుకుంటే స్పందన అంతంతమాత్రమే. అయితే తక్షశిల అధ్యాపకుడిగా నేను పోషిస్తున్న కొత్త పాత్రలో ఎదురైన ఈ అనుభవానికి నిరుత్సాహపడలేదు. ఒకరిద్దరితో ఆరంభమైన నా ఆశయ పయనం, సంవత్సరం తిరిగేసరికల్లా పది మంది పేద విద్యార్థులకి చేరుకుంది. ఆ సంవత్సరం టెన్త్‌లో కొందరు తొంభై శాతం మార్కులు సాధించడంతో క్రమేపీ జనుల దృష్టి తక్షశిలపై పడింది.

అయితే తక్షశిల ప్రవేశానికి ముఖ్యమైన అర్హత పేదరికం. తరువాత సహజమైన తెలివితేటలు. మొదటిసారిగా నా కోచింగ్ పొందిన అక్కడి విద్యార్థులు వందా రెండువందల ర్యాంకులు సాధించేసరికి అక్కడ సీటుకోసం డబ్బున్నవారు కూడా నాతో సంప్రదింపులు మొదలుపెట్టారు. అటువంటివారిని సున్నితంగా తిరస్కరించాను. నా ఆశయ సాధనలో రాజీకి తావేలేదు.



## రంభ చేసిన ఫిర్యాదు

'దొంగసచ్చినోళ్లు' సినిమాలో రంభ నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ చిత్రం గొడవల్లో పడింది. తనకి రావాల్సిన రెమ్యునరేషన్ బ్యాలన్స్ అమౌంట్ తాలూకు చెక్కు బ్యాంక్‌లో బౌన్స్ కావడంతో నిర్మాతలపై 'మా'లో ఫిర్యాదు చేసిందిట రంభ. రఘుబాబు-కృష్ణభగవాన్ ప్రధాన పాత్రల్ని పోషిస్తున్న ఈ సినిమాలో మరో ముఖ్య భూమికను రంభ ధరిస్తోంది. మరి ఈ సంఘటన సామరస్యంగానే పరిష్కారం కావాలని సినీజనాలు కోరుకుంటున్నారు.




ఇంజనీరింగ్, మెడికల్ ఎంట్రెన్స్‌లో మంచి ర్యాంకులు సాధించిన పేద విద్యార్థులని అక్కడితో వదిలేయక కాలేజీలో చేర్పించి ఆ ఖర్చులు కూడా తక్షశిలే భరించే విధంగా కృషి చేసాను. ఈ నోబుల్ కాజ్‌కి 'నేను సైతం' అంటూ నా మిత్రులు, సంఘ సేవకులు సహాయాన్ని అందించడం నాలో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది.

***

"ఏమండీ! ఈ ఏడాది ఎమ్‌సెట్ ర్యాంకుల్లో మన తక్షశిల విద్యార్థులు తప్పకుండా టాప్‌టెన్‌లో ఒకరిద్దరైనా వస్తారని నా నమ్మకం. మీరు పడ్డ కష్టం చూస్తే ఇది తప్పక సాధ్యమనిపిస్తోంది నాకు."

"అవును అన్నపూర్ణా! ఈసారి తప్పక టాప్ ర్యాంకులు వచ్చి తీరాలి. పిల్లలు రాత్రింబవళ్లు చాలా కష్టపడి చదివారు. ఫలితంకోసం ఎదురు చూస్తున్నారు" అన్నాను ఆశాభావంతో.

"ఇంకెంత ఒకటి రెండురోజుల్లో సస్పెన్స్ తీరిపోతుంది" అంది అన్నపూర్ణ.

"అన్నపూర్ణా! ఇప్పుడు నాకు చాలా తృప్తిగా ఉంది. ఎందుకో నా జీవితంలో నేను ఎన్ని పాత్రలని విజయవంతంగా నిర్వర్తించినా లేని తృప్తి, ఇప్పుడు ఈ కొత్త పాత్రలో లభిస్తోంది. ఇది అనిర్వచనీయం. బహుశా గతంలో నా బాధ్యతలు నిర్వర్తించడంలో నా స్వార్థం అంతో ఇంతో వుండేది. ఇప్పుడలా కాదు, ఇది పూర్తిగా నిస్వార్థమైన సేవ. పేదల జీవితాలు ఓ ఒడ్డున పడుతుంటే వారి కళ్లల్లో కదలాడే కృతజ్ఞతాభావం నిజంగా చెప్పలేని అనుభూతిని మిగులుస్తోంది".

"ఈ తృప్తి మీకే కాదండీ, నాకూ ఎంతో ఆనందాన్ని ఇస్తోంది."

"రిటైర్డ్ లైఫ్ ఎంతో బోర్‌గా డల్‌గా గడుస్తుందనుకునేవాడ్ని. కానీ తక్షశిల మూలంగా రోజులు ఇట్టే గడిచిపోతున్నాయి."

***

ఊహించినట్టే ఆ సంవత్సరం తక్షశిల ఇంజనీరింగ్‌లో మొదటి రెండు, ఐదు, మెడికల్‌లో మొదటి ర్యాంకూ, ఏడో ర్యాంకు సాధించి మొత్తం రాష్ట్రంలోనే సంచలనం సృష్టించింది. మిగతా విద్యార్థులు కూడా మంచి ర్యాంకులే సాధించారు.

నగరంలో ఎక్కడ చూసినా తక్షశిల చర్చే. ఇతర ప్రముఖ విద్యాసంస్థలకి ఒక విధంగా తక్షశిల వెన్నులో వణుకు పుట్టించింది. ముఖ్యంగా టీవీలు తక్షశిల గురించి ప్రముఖంగా ప్రసారం చేసాయి.

టీవీ విలేకరులు నా ఇంటర్‌వ్యూ కోసం శతవిధాలా ప్రయత్నించి విఫలమయ్యారు.

అన్నింటికీ నా విద్యార్థులే సమాధానమిస్తారని ప్రచార హంగామా నుండి సున్నితంగా తప్పించుకున్నాను.

ఆ రోజు సాయంత్రం ప్రసారమవుతున్న తక్షశిల విద్యార్థుల ప్రత్యేక కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకిస్తోంది అన్నపూర్ణ.

"ఏవండీ! చూడండి మన పిల్లలు తక్షశిల గురించి ఎంత గొప్పగా చెప్తున్నారో? ఒక్కసారి వచ్చి నాకోసం చూడండి" అని బలవంతం చేయడంతో అయిష్టంగానే టీవీకేసి చూసాను.

"తక్షశిల గురించి రెండు ముక్కలు చెప్పండి"

"తక్షశిల... ఆ పేరులోనే పవిత్రత! ఓ మహోన్నత వ్యక్తి ఆశయ రూపకల్పనా, పేద విద్యార్థుల పాలిట చదువుల కోవెల!"

"మీ మాస్టారి గురించి వివరిస్తారా?"

"ప్రతి మనిషి జీవితాంతం తనకోసమో లేక తన వారికోసమో పాటు

పడుతుంటాడు. మహానుభావులు మాత్రమే నిత్యం సమాజంకోసం పాటు పడేది. అయితే సమాజానికి సేవ చేయడానికి ప్రతి ఒక్కడూ మహానుభావుడు కానవసరంలేదు. జీవితకాలంలో అరవైశాతం మనకోసం పాటుపడితే కనీసం జీవితం చివరి భాగంలోనైనా మన పక్కమనిషికోసం ఆలోచించి తోచిన మంచిని పదిమందికి చెప్తే మానవ జన్మకి సార్థకత ఏర్పడుతుంది. సరిగ్గా ఇదే మా మాష్టారి ఆశయం. జీవితంలో ఒక దశకు చేరుకుని నిశ్చింతంగా స్థిరపడ్డ ప్రతి ఒక్కరూ కాలుమీద కాలు వేసుకుని కూర్చుని పేపర్లు చదువుతూ టీవీ చూస్తూ కాలం హాయిగా గడిపేయవచ్చన్న ఆలోచన మాని సత్తువున్నన్నాళ్లూ సాటి మనిషికి తోడ్పడడమే ధ్యేయంగా పెట్టుకుంటే ప్రతి సామాన్యుడూ మహానుభావుడు కాగలడని మా మాష్టారూ నిరూపించారు. తనదైన బాటలో అహర్నిశలూ శ్రమించి మా మాష్టారు నిస్వార్థ చింతనతో ఈ కీర్తిని సాధించారు.''

టీవీలో ఇంకా ఇంటర్వ్యూ కొనసాగుతోంది. నా మనసు టీవీపైలేదు. తక్షశిలను అభివృద్ధి పంథాలో ఇంకా ఎలా నడపాలా అని నా బుర్ర చురుగ్గా ఆలోచిస్తోంది.

"ఏమండీ మీ గురించి మన తక్షశిల గురించి మీ విద్యార్థులు ఎంత గొప్పగా చెప్పారో?''

నాలో ఎలాంటి భావాలూ లేవు. అన్నపూర్ణ మాటలు మౌనంగా వింటున్నాను.

ఇంతలో కాలింగ్‌బెల్ మ్రోగడంతో లేచి వెళ్లి తలుపు తీసింది అన్నపూర్ణ.

"నమస్కారమమ్మా! రాఘవరావుగారున్నారా?''

ఆ వ్యక్తిని ఎగాదిగా చూసింది అన్నపూర్ణ.

"నువ్వు శేషుకదూ'' అంది పరీక్షగా చూస్తూ.

"అవునమ్మా శేషునే. మీరు బాగున్నారా?'' అన్నాడు శేషు తనని గుర్తుపట్టినందుకు ఆనందంగా.

"రా..రా..లోపలికి రా. ఎలా వున్నావు? మీ అమ్మ ఎలావుంది?''

"నేను బాగానే వున్నాను. అమ్మావాళ్లు ఊర్లో వుంటున్నారు'' అన్నాడు శేషు.

"ఏమండీ శేషు వచ్చాడండీ''

భార్య మాటలకి లోపలినుంచి బయటకొచ్చిన నేను శేషును చూసి "రావయ్యా రా కూర్చో'' అంటూ సోఫా చూపించాను.

''ఏంటి సంగతులు? ఎలా వుంది నీ ప్రొఫెషన్?'' అన్నాను.

"బాగానే వుంది సార్. కంగ్రాచ్యులేషన్స్. మీరు అద్భుతమైన విజయం సాధించారు. ఉదయం నుండి ఏ టీవీ ఛానల్ చూసినా మీ గురించే. నిజంగా నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ ఆనందానికి ముఖ్య కారణం.. ర్యాంకులు సాధించిన వారంతా పేద విద్యార్థులే'' అన్నాడు శేషు.

"నిజం చెప్పమంటావా శేషూ? తక్షశిల స్థాపనకీ, అది ఈ రోజు ఈ స్థితికి రావడానికి ముఖ్య కారణం నువ్వే. ఈ విజయం నీది'' స్థిరంగా అన్నాను.

ఆశ్చర్యపోయాడు శేషు.

"అదేంటి సార్! నేనా?'' అన్నాడు శేషు ఆశ్చర్యం నుండి తేరుకోకుండానే.

"ముమ్మాటికీ నువ్వే. నువ్వే ప్రేరణ. నువ్వే కనుక మళ్లీ తారస పడకపోయి ఉంటే నాకీ ఆలోచన వచ్చుండేది కాదేమో! నువ్వు జీవితంలో ఏది కోల్పోయావో నీలాంటి అర్హతగల పేద విద్యార్థులు కొందరైనా నా ద్వారా దాన్ని పొందాలనే సదుద్దేశ్యంతో తక్షశిల స్థాపించబడింది.''

నా మాటలకి శేషు ఇబ్బంది పడడం స్పష్టంగా గమనించాను.

"సార్! నాదొక చిన్న రిక్వెస్ట్. మీరు తలపెట్టిన ఈ మహా యజ్ఞంలో ఉడతా భక్తిగా ఈ విరాళం తక్షశిలకి ఇద్దామనే ముఖ్యంగా ఇక్కడకు వచ్చాను. తీసుకోండి'' అంటూ పదివేల రూపాయల చెక్కును అందించాడు శేషు.

ఆశ్చర్యపోవడం నావంతయింది.

"ఆనందగా ఉందయ్యా. నిజంగా ఆనందంగా వుంది. ఉదయం నుండీ నన్ను అందరూ ఎంత కీర్తిస్తున్నా కలగని ఆనందం నీ చర్య ద్వారా కలిగింది'' అంటూ సంతోషంగా చెక్కు అందుకున్నాను.

"ప్రతి వ్యక్తి మీలా ఆలోచించి జీవితంలో ఏదో ఒక దశలో సమాజంపట్ల తన బాధ్యతని గుర్తెరిగి సమాజానికి మంచి చేసే దశలో అడుగులేస్తే నాలాంటి విద్యార్థులకి న్యాయం జరిగి తీరుతుంది'' అన్నాడు శేషు కాస్త బాధగా.

★



## చిరునవ్వుల సూత్రం

ముఖంమీద చిరునవ్వుతో ఎలాంటివారినైనా ఆకట్టుకోగలమనేది అందరికీ తెలిసిన విషయమే. దక్షిణ కాలిఫోర్నియా దంత వైద్యుడొకరు పళ్ల తెల్లదనం, చిరునవ్వుకు తోడయితే దాని ప్రభావం అంతా ఇంతా కాదని తేల్చారు. పళ్ల మెరుపు, కళ్ల మెరుపుతో పోటీ పడాలట. పళ్లు పాచిగా, మురికిగా ఉంటే ఎంత చిరునవ్వు నవ్వినా ప్రయోజనం లేదంటున్నారు.

-శ్రీసాయివల్లవి

